క్లుప్తంగా

తుంగభద్రకు పోటెత్తిన వరద



గంగమ్మకు పూజలు చేస్తున్న ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజు

మంత్రాలయం: కర్ణాటక రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా తుంగభద్ర నదికి వరద నీరు పోటెత్తింది. మంత్రాలయం సమీపంలోని పుష్కర ఘాట్ల వద్ద నీటి ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజు వరద నీటికి పూజలు చేసి చీర, పసుపు కుంకుమ సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నదిలో ప్రవాహం క్రమంగా పెరుగుతుందని వివరించారు. నది ఒడ్డున శ్రీమఠం అధికారులు ఏర్పాటు చేసిన షవర్ల వద్ద స్నానాలు చేయాలని సూచించారు. నది వద్ద పగలు, రాత్రి బందోబస్తు ఉంటుందని ఎస్‌ఐ వివరించారు.

మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సెబ్ పోలీసులు

ఆదోనిరూరల్: ఆదోని పట్టణంలోని అరుంజ్యోతినగర్ వద్ద మంగళవారం హెచ్.ఉమాదేవి అనే మహిళ వద్ద 38 కర్ణాటక మద్యం ప్యాకెట్లను గుర్తించి ఆమెను అరెస్టు చేసినట్లు సెబ్ సీఐ హరికృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా సెబ్ సీఐ మాట్లాడుతూ.. మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, నిందితురాలిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఎవరైనా అక్రమంగా కర్ణాటక మద్యం కలిగి ఉన్నా, తరలించినా కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. దాడుల్లో సెబ్ ఎస్‌ఐ శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

ఆదోనిఅర్బన్: స్థలం విషయంలో తనను కులం పేరుతో దూషించారని బాధితుడు ఉదయ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుగ్గా రమేష్, నీలకంఠపై మంగళవారం ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ విక్రమసింహా విలేకరులకు తెలిపారు. పట్టణ శివారులోని ఇస్వీ రోడ్డులో బుగ్గా రమేష్, నీలకంఠకు చెందిన వెంచర్ ఉన్నదని, ఆ వెంచర్ పక్కనే ఉదయ్‌కుమార్ స్థలం ఉండకూడదనే ఉద్దేశంతో అతన్ని కులం పేరుతో దూషించారని తెలిపారు. దీనిపై ఉదయ్‌కుమార్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, విచారించి ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న ఎస్‌ఐ తిమ్మయ్య

నందవరం: కర్ణాటక మద్యం అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తిమ్మయ్య పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ మాట్లాడుతూ.. మండల పరిధిలోని గంగవరం గ్రామం ఊరి బయట తుంగభద్ర నది ఒడ్డున బ్యాగ్‌లో అక్రమంగా కర్ణాటక మద్యం తీసుకెళ్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో దాడులు నిర్వహించామన్నారు. మద్యం తరలిస్తున్న కర్ణాటక రాష్ట్రం, రాయచూర్ జిల్లా, గుంద్రేవుల గ్రామానికి చెందిన మాల శివశంకర్‌ను పట్టుకొని జాన్స్ ఒరి నల్ ఛాయస్ విస్కీ 768 (90 ఎంఎల్) టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితుడి ని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

యువతి అదృశ్యం



ఉషశ్రీ (ఫైల్)

వెల్దుర్తి: మండల పరిధిలోని చెరుకులపాడు సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి (జీఎంఎస్‌కే) ఉషశ్రీ అదృశ్యమైనట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఆమె తల్లి సరస్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. కర్నూలులో నివాసముంటున్న ఉషశ్రీ ప్రతిరోజులాగే సోమవారం విధి నిర్వహణకు బయలుదేరింది. సాయంత్రం ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెంది కుటుంబసభ్యులు పలు చోట్ల వాకబు చేశారు. మంగళవారం వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పిల్లిగుండ్లలో డెంగీ నిర్ధారణ

గోనెగండ్ల: మండల పరిధిలోని పిల్లిగుండ్ల గ్రామంలో తొమ్మిదేళ్ల బాలికకు డెంగీ వ్యాధి నిర్ధారణ అయినట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి సాయిబాబా తెలిపారు. దీంతో మంగళవారం వైద్య సిబ్బంది ఆ గ్రామానికి వెళ్లి బాలిక ఇంటి పరిసరాలను శుభ్రం చేయించారు. అలాగే దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవన్నారు. ఎవరికైనా డెంగీ లక్షణాలు ఉంటే స్థానిక వైద్యులను సంప్రదించి చికిత్స చేయించుకోవాలన్నారు.

ఓటరు జాబితా పక్కాగా రూపొందించండి



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్



హాజరైన బీఎల్‌ఓలు

ఆదోనిరూరల్: ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించాలని ఆదోని సబ్ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ అభిషేక్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మున్సిపల్, ఎంపీడీఓ కార్యాలయాల్లో ఆదోని నియోజకవర్గంలోని రూరల్, అర్బన్ ప్రాంతాల్లోని బీఎల్‌ఓలకు సబ్‌కలెక్టర్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ నిర్వహించిన ఫారం–6లోని నూతన ఓటర్ల కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 01-01-2024 లోపు 18 సంవత్సరాలు నిండే భారతీయ పౌరులకు ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించాలన్నారు. నూతన ఓటర్లుగా నమోదు చేసేందుకు సంబంధిత ధ్రువపత్రాలను తీసుకొని, జనవరి 5వ తేదీన ప్రచురించనున్న చివరి జాబితాలో వారిని పొందుపరచాలన్నారు. ఫారం–7లోని ఓటర్ తొలగింపునకు సంబంధించి కచ్చితమైన ఆధారాలను సేకరించాలన్నారు. ఓటరు జాబితాలో డబుల్ ఎంట్రీలు, మరణించిన ఓటర్లకు సంబంధించి తగిన ధ్రువపత్రాలను కార్యాలయంలో సమర్పించాలన్నారు. బూత్ స్థాయి అధికారులు కేవలం నోటీసులు సర్వ్ చేయడానికి, క్షేత్రస్థాయిలో విచారించి తగిన నివేదికలు ఇవ్వడానికి మాత్రమే ఉపయోగిస్తామన్నారు. ఫారం–8కు సంబంధించి ప్రస్తుతం ఉన్న ఓటర్ల జాబితాలో ఏవైనా ఇంటి నంబర్లు, ఓటర్ల వయస్సు, పుట్టిన తేదీల్లో తప్పులు నమోదై ఉంటే సవరణ ద్వారా అవకాశం ఉంటుందని సబ్ కలెక్టర్ తెలిపారు. తహసీల్దార్ వెంకటలక్ష్మి, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సిబ్బంది ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి



పారిశుద్ధ్య కార్మికులకు సబ్బులు, కొబ్బరినూనె అందజేస్తున్న ఈఓ చంద్రశేఖర్

కోసిగి: గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచే పారిశుద్ధ్య కార్మికులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వైఎస్సార్ సీపీ మండల నాయకుడు మాణిక్యరాజు అన్నారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ ఈఓ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు నెలకు సరిపడే సబ్బులు, కొబ్బరి నూనెను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మేజర్ గ్రామ పంచాయతీలో 45 మంది కార్మికులు పనిచేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో తాగునీటి సరఫరా, డ్రయినేజీ, రోడ్లను శుభ్రపరచడం, విద్యుత్ సరఫరా అందించడంతో కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్న కార్మికులు సంపూర్ణ ఆరోగ్యం పొందాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు రాజేష్, వార్డు మెంబర్ ఈరన్న, శ్రీను, ఉసేని, మధు, రామకృష్ణ, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి



ఆదోనిలో సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఆదోనిరూరల్: విద్యుత్ చార్జీలు, నిరుద్యోగం అధిక ధరలకు నిరసనగా సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, సీనియర్ నాయకులు ఈరన్న, పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, మండల కార్యదర్శి లింగన్న మాట్లాడుతూ.. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పేదల ఓట్లతో అధికారంలోకి వచ్చి పేదల సంక్షేమానికి పాటుపడకుండా పెట్టుబడిదారుల సంక్షేమమే పరమావధిగా పనిచేస్తుందని విమర్శించారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచి ఇతర నిత్యావసర వస్తువుల ధరలు పెరగడానికి కారణమైందన్నారు. దీంతో ప్రజలపై మోయలేని భారం పడుతుందన్నారు. ఇంతవరకు ఎలాంటి ఉద్యోగ అవకాశాలు కల్పించలేదని, ప్రభుత్వ రంగ సంస్థల్లో లక్షలాది పోస్టులు ఖాళీగా ఉన్నా భర్తీ చేయడంలేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను విడనాడి పెంచిన నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏఓకి వినతి పత్రం అందజేశారు. సీపీఎం నాయకులు గోపాల్, ముక్కన్న, తిప్పన్న, శేఖర్, బాషా తదితరులు పాల్గొన్నారు.

నేడు మాంసం దుకాణాల బంద్

ఆదోనిఅర్బన్: ఆదోని మున్సిపాలిటీ పరిధిలో బుధవారం శ్రీకృష్ణాష్టమి సందర్భంగా మటన్, చికెన్ దుకాణాలు, నాన్ వెజిటేరియన్ వ్యాపారాలు చేయకూడదని కబేళాలను మూసివేయాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి ఆదేశించారు. ఎవరైనా ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి షాపులు తెరిచినా, హోటళ్లలో నాన్ వెజ్ ఆహారం తయారు చేసినా, విక్రయించినా అలాంటి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘర్షణలో వ్యక్తికి గాయాలు

ఆదోనిఅర్బన్: శంకర్‌నగర్ కాలనీలో బార్‌పేటకు చెందిన మహ్మద్‌పై మహబూబ్‌బాషా అనే వ్యక్తి మంగళవారం దాడి చేశారు. ఘటనపై టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. డ్రైవింగ్ విషయంలో మహ్మద్, శంకర్‌నగర్‌కు చెందిన మహబూబ్‌బాషా ఘర్షణకు దిగారు. ఈ ఘర్షణలో మహ్మద్‌పై మహబూబ్‌బాషా దాడి చేయడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు క్షతగాత్రుడిని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై విచారణ చేపడుతున్నట్లు టూటౌన్ సీఐ శ్రీనివాస నాయక్ తెలిపారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణంలోని మిల్టన్ గ్రామర్ పాఠశాలలో మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవం, శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. పాఠశాల కరెస్పాండెంట్ రమేష్‌బాబు మాట్లాడుతూ.. సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సుచించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు మోహన్‌రావు మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా మనమంతా కలసిమెలసి జీవించాలన్నారు. శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో విద్యార్థులు ఆకట్టుకున్నారు. విద్యార్థులు చేసిన వృత్యాలు అలరించాయి. పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో సర్వీసులు పెంచాలి



కృష్ణగిరి సచివాలయంలో పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి

కృష్ణగిరి: గ్రామ సచివాలయాలలో ప్రజలకు అందించే సర్వీసులను పెంచాలని కర్నూలు డివిజనల్ అభివృద్ధి అధికారి బాలకృష్ణారెడ్డి ఆదేశించారు. ఆయన మంగళవారం కృష్ణగిరి గ్రామ సచివాలయాన్ని, మండలంలోని మీ–సేవా కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి సచివాలయ పరిధిలో రోజుకు 20 నుంచి 30 సర్వీసులు జరిగేలా ఉద్యోగులు కృషి చేయాలన్నారు. అలాగే ఆయుష్మాన్ భారత్ యాప్‌ను అందరూ డౌన్‌లోడ్ చేసుకుని ప్రభుత్వ సేవలను అందులో అప్‌లోడ్ చేయాలని సూచించారు. యాప్ ద్వారా అర్హులైన వారందరికీ రూ.5 లక్షల బీమా ఉంటుందన్నారు. అలాగే సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించి బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. అనంతరం కృష్ణగిరి, ఎరుకలచెర్వు, చిట్యాల తదితర గ్రామాల్లోని మీ–సేవా కేంద్రాలను పరిశీలించారు. ఆయా సర్వీసులను నిర్దేశించిన మొత్తం కంటే అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. మరోమారు ఇలాంటి ఘటనలు జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు.



జంపింగ్ చేస్తున్న చిన్నారులు,



షిప్పింగ్ బోట్‌లలో కేరింత,



కార్ రేసింగ్‌తో ఉత్సాహం

ఉరుకుందలో సందడి



రంగుల రాట్నంపై విహారం

కౌతాళం: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఉరుకుంద ఈరన్న స్వామి క్షేత్రంలో శ్రావణ మాస ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నారు. నెల రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలు భక్తజనులకే గాకుండా చిన్నారుల పాలిట స్వర్గధామంగా ప్రసిద్ధి. ఉత్సవాల్లో భాగంగా స్వామివారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. వారికి ఆహ్లాదం పంచేలా సౌకర్యాలను వ్యాపారులు ఏర్పాటు చేశారు. మహారాష్ట్ర, కర్ణాటక విజయవాడ వంటి ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు పిల్లలను ఆకట్టుకునేలా బ్రేక్‌డ్యాన్స్‌తో పాటు వివిధ రకాల ఆటల విడిదిలను ఏర్పాటు చేశారు. ట్రైన్, వీల్ చైర్స్, జెయింట్ వీల్, బ్రేక్ డ్యాన్స్, షిప్పింగ్ బోట్స్‌లు, కార్ రేసింగ్, జంపింగ్ బోర్డ్ వంటి వాటిని ఏర్పాటు చేయడంతో ఉరుకుందలోని బస్టాండు ప్రాంతం ఆహ్లాదకరంగా మారింది. చిన్నారులు ఉత్సాహంగా వాటిపై సవారి చేసి ఆనందం పొందుతున్నారు. అలాగే మిఠాయి అంగళ్లు, గాజుల దుకాణాలు భక్తుల కొనుగోళ్లతో రద్దీగా మారాయి.

గురుభ్యోనమః



కోసిగిలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు

ఆదోని సెంట్రల్: విద్యార్థులకు బోధించడం వల్ల జ్ఞానం వృద్ధి చెందుతుందని గట్టిగా నమ్మిన వ్యక్తి సర్వేపల్లి రాధాకృష్ణన్ అని ఉపాధ్యాయులు గురురాజా, వీరచంద్రయాదవ్, అబీదాబేగం, ఇందిర, ప్రియాంక పేర్కొన్నారు. మంగళవారం ఆర్‌ఆర్ లేబర్ కాలనీలోని పురపాలక ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరుపుకొన్నారు. ఉపాధ్యాయుడిగా, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతిగా ఆయన చేసిన సేవలను కొనియాడారు.

– ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేయాలని సుచించిన మహోన్నత వ్యక్తి సర్వేపల్లి రాధాకృష్ణన్ అని పురపాలక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున అన్నారు. మంగళవారం పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు ఫయాజ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆదోనిఅర్బన్: ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా), అవోపా మహిళా విభాగ్ ఆధ్వర్యంలో సాయిభారతి పాఠశాలలో మంగళవారం గురు పూజోత్సవం నిర్వహించారు. సీనియర్ ఉపాధ్యాయులు నాగభూషణం, రత్నమయ్య, దుర్గేష్, శకుంతల, గిరిబాబు, పరిమళకు దుశ్శాలువాలు, పూలమాలలు వేసి సన్మానం చేశారు. ఆదోని పట్టణ అవోపా అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్‌గుప్తా, కార్యదర్శి మిరియాల శ్రీధర్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సేవను కొనియాడారు. అవోపా ఉపాధ్యక్షులు ఈరన్నశెట్టి, రంగ, రఘు, మహిళా విభాగ్ అధ్యక్ష కార్యదర్శులు సంగీత, మమతశ్రీ, బిందు తదితరులు పాల్గొన్నారు.

పెద్దకడబూరు: సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర అని బాలబంధు, గణితోపాధ్యాయులు గద్వాల సోమన్న అన్నారు. మండల పరిధిలోని కంబదహాల్ గ్రామంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయులను శాలువా, పూలమాలలతో సన్మానించారు.





ఆదోని పురపాలక ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఉపాధ్యాయులు,ఉపాధ్యాయులను సన్మానిస్తున్న అవోపా సభ్యులు



పెద్దకడబూరు మండలం కంబదహాల్ గ్రామంలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

కోసిగి: ప్రతి ఒక్కరు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను గౌరవించాలని కోసిగి బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఖలీల్ అహ్మద్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాధాకృష్ణన్ ఉపాధ్యాయుడిగా పనిచేసి రాష్ట్రపతి స్థాయికి ఎదిగారన్నారు. ఆయన సేవలను కొనియాడారు.

మంత్రాలయం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం హంపయ్య, కేజీబీవీలో ప్రిన్సిపాల్ శాంతి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన గొప్పతనం గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ ఉన్నత చదువులు చదివి గుర్తింపు తెచ్చుకోవాలని పిలుపునిచ్చారు. సీఆర్పీఎఫ్ కన్వీనర్ డాక్టర్ లింగన్న తదితరులు ఉన్నారు.

కౌతాళం: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మంగళవారం గురు పూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బదినేహాల్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ప్రధానోపాధ్యాయురాలు అరుణాజ్యోతి మాట్లాడుతూ రాధాకృష్ణన్ గొప్పతనాన్ని, సేవలను కొనియాడారు.

వైఎస్సార్ చేయూత వర్తింపజేయడంపై హర్షం



బుడజంగాల కులస్తులకు డిక్లరేషన్ ఫారం ఇస్తున్న ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్

కోసిగి: బేడ బుడగ జంగాల కులస్తులను వైఎస్సార్ చేయూత పథకానికి అర్హులుగా గుర్తించడంపై ఆ సంఘం తాలుకా అధ్యక్షుడు అయ్యప్ప, కోసిగి మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్ చేయూత పథకానికి అర్హత కలిగిన బేడ బుడగ జంగాల మహిళలకు ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ డిక్లరేషన్ ఫారంలు అందించారు. ఈ సందర్భంగా బుడగ జంగాల సంఘం తాలుకా అధ్యక్షుడు అయ్యప్ప మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో బేడ బుడజంగాల వారికి కుల, ఆదాయ సర్టిఫికెట్లు లేకపోవడంతో ఎలాంటి సంక్షేమ పథకాలు వర్తింపజేయలేదన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మధు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిసి విన్నవించడంతో అర్హత కలిగిన వారికి సంక్షేమ పథకాలు వర్తింపజేసేలా నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. కోసిగికి చెందిన మారెమ్మ, తిప్పక్కలకు ఎంపీడీఓ సొంత డిక్లరేషన్‌తో పథకం మంజూరు చేయించారు. అలాగే కోసిగిలో 21 బుడగజంగాల కుటుంబాలకు జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు మంజూరు చేయించారన్నారు. తమ కులస్తులకు ప్రభుత్వ పథకాలకు అర్హత కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆ సంఘం మండల నాయకులు వెంకటేష్, మారెప్ప, శంకరప్ప, అంజిని, పరమేష్, వీరన్న, వీరేష్ తదితరులు ఉన్నారు.

సమస్యలపై సమరభేరి



తహసీల్దార్ రామేశ్వర్‌రెడ్డికి మెమోరండం ఇస్తున్న నాయకులు

కౌతాళం: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేదల నడ్డి విరిచిందని, పెట్రోల్, డీజిల్, నిత్యావసర ధరలను పెంచి సామాన్యులపై పెనుభారం మోపిందని సీపీఎం సీనియర్ నాయకుడు మల్లయ్య, మండల కన్వీనర్ ఈరన్న, నాయకుడు వీరేష్ అన్నారు. దేశ వ్యాప్తంగా సీపీఎం చేపట్టిన సమరభేరి కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డికి మెమోరండం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికలు సమిపిస్తున్న తరుణంలో ప్రధాని నరేంద్రమోదీ గ్యాస్ ధర తగ్గించి ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక ఉన్న ఉద్యోగాలను తీసేసి యువతను బజారుపాలు చేస్తోందని మండిపడ్డారు. నాయకులు వెంకటేశ్, రామలింగ, సత్యప్ప, వన్నూర్, రామాంజినేయులు, కేశవ, శంకర్, వీరేష్, వలి పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై ఆందోళన వద్దు

ఆదోనిటౌన్: క్షయ వ్యాధిపై ఆందోళన వద్దని, పౌష్టికాహారం, క్రమం తప్పకుండా మందులు వాడడం వల్ల నయం చేసుకోవచ్చని డాక్టర్ మౌనిక తెలిపారు. మంగళవారం పట్టణంలోని అరుంజ్యోతినగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో క్షయవ్యాధి నివారణపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రెండు వారాలకు మించి దగ్గు, గళ్లలో రక్తపుచారలు, ఆకలి తగ్గిపోవడం, బరువు తగ్గడం, ఉదయం, సాయంత్రం జ్వరం రావడం వంటి లక్షణాలు కనిపించినట్లయితే వెంటనే అందుబాటులో ఉండే ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సమావేశంలో సూపర్‌వైజర్ బాబు, ఏఎన్‌ఎం, ఆశావర్కర్లు, ప్రజలు పాల్గొన్నారు.

టీబీ నివారణ చర్యలు

- పుట్టిన బిడ్డకు బీసీజీ వ్యాక్సిన్ వేయించాలి.
- దగ్గినా, తుమ్మినా మోచేయిని అడ్డు పెట్టుకోవాలి.
- మాస్కు ధరించాలి. మనిషి మనిషికి మధ్య 2 మీటర్ల దూరం ఉండాలి.
- ఎక్కడ పడితే అక్కడ ఉమ్మి వేయరాదు. గళ్లపై మట్టిని కప్పాలి.

కొత్త కాలనీలో రోడ్లు నిర్మించాలి



ఎంపీడీఓ సుబ్బారాజుకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

కౌతాళం: మండల పరిధిలోని ఏరిగేరి గ్రామంలో ఆర్డీటీ వారు కొత్తగా నిర్మించిన కాలనీలో రోడ్లు నిర్మించాలని సీపీఎం ఆధ్వర్యంలో ఎంపీడీఓ సుబ్బారాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకుడు మల్లయ్య ఏరిగేరి గ్రామ నాయకుడు వీరేష్ మాట్లాడుతూ.. వర్షం వస్తే కొత్త కాలనీలో వీధులు బురదమయంగా మారి పిల్లలు, ముసలివారు నడవడానికి కూడా ఇబ్బందిగా ఉంటోందన్నారు. కాలనీ ప్రాంతం నల్లరేగడి భూమి కావడంతో చినుకు పడితే బురదమయంగా మారుతోందని వాపోయారు. అలాగే కాలనీలో విద్యుత్ కూడా సరిగా లేకపోవడంతో చీకట్లో చాలా మంది బురద నీటిలో పడిన సందర్భాలు ఉన్నాయని, అధికారులు స్పందించి ఆర్డీటీ కాలనీలో రోడ్లు నిర్మించాలని లేదా తాత్కాలికంగా గ్రావెల్ అయినా వేయాలని వారు కోరారు.

మాతాశిశు మరణాలు నివారించండి

మద్దికెర: ప్రమాద సంకేతాలు ఉన్న గర్భవతులకు ఉచితంగా టిఫా స్కానింగ్, అల్ట్రా సోనోగ్రాఫిక్ ద్వారా గర్భంలోని బిడ్డ లోపాలను గుర్తించి మాతాశిశు మరణాలు నివారించాలని ప్రభుత్వ వైద్యాధికారులు నగేష్, శ్రీలక్ష్మి సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ఆశా డే కార్యక్రమం నిర్వహించారు. సెప్టెంబర్ నెలను పోషణ మాసోత్సవాలుగా నిర్వహించి ప్రజల్లో రక్తహీనతపై అవగాహన కల్పించాలన్నారు. సీహెచ్‌ఓ నిరంజన్‌బాబు ఉన్నారు.